క్లుప్తంగా

బూచేపల్లి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అందరితో ఆత్మీయంగా మెలిగే బూచేపల్లి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బూచేపల్లి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో రానున్న ఎన్నికల్లో పార్టీ అఖండ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్సైని కలిసిన నేతలు



ఎస్సైతో వైఎస్సార్ సీపీ నేతలు

హనుమంతునిపాడు: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మాధవరావును వైఎస్సార్ సీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సైని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర నేతలు కలిశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.90 వేల విరాళం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచలకలో ఆదివారం సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.90 వేల చెక్కును పొదుపు మహిళలు ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రావు, ఏపీఎం విద్యాసాగర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

టంగుటూరు: వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి పొలం పిలుస్తోంది నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఆలకూరపాడు, 25న జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖలు ఉద్యానవనశాఖ, పశుసంవర్ధక శాఖ, మార్కెటింగ్, బ్యాంకింగ్, విద్యుత్, మత్స్యశాఖ అధికారులు పాల్గొని గ్రామసభలు నిర్వహిస్తారన్నారు.

నేడు మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బొలినేని సురేష్ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఎస్‌పురం(పామూరు): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.కల్పన అన్నారు. స్థానిక వడ్డెపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల, పాఠశాల స్వీపర్స్ ఉమ్మడి సమావేశం ఎస్.తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలని, మెస్ చార్జీలను ఒక్కొక్కరికి రూ.20 పెంచాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, వంటవారికి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్‌చేశారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. బి.యేసురత్నం, నాగమ్మ, తిరుమలమ్మ, పలువురు పాల్గొన్నారు.

బడ్డీ బంకు దగ్ధం

హనుమంతునిపాడు: మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా బడ్డీ బంకు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే..కాశీనాయక గుడి పక్కన ఉన్న పఠాన్ చిన్న కాశింపీరా బడ్డీ బంకు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. బంకులో బీడీలు, సిగరెట్లు, చిన్నపిల్లల తినే వస్తువులు మొత్తం రూ.50 వేల విలువైనవి కాలిపోయాయని వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సీతారాంపురంలో తగలబడిన బంకు

నిఘా నేత్రాలకు మసక

- పట్టణంలో మూలన పడిన సీసీకెమెరాలు
- ప్రధాన కూడళ్లలో ఒక్కటీ పనిచేయని దుస్థితి
- ఏ చిన్న సంఘటన జరిగినా ఆధారాల కోసం వెంపర్లాడాల్సిన దుస్థితిలో పోలీసులు

కందుకూరు:

నేర నియంత్రణలో ప్రస్తుతం సీసీ కెమెరాల పాత్ర గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఏ చిన్న సంఘటన జరిగినా మొదట సీసీ కెమెరాలో రికార్డు గురించే పోలీసులు ఆలోచిస్తారు. కానీ కందుకూరు పట్టణంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. పోలీస్ సబ్ డివిజన్ హెడ్‌క్వార్టర్ అయిన కందుకూరు పట్టణంలో ఒక్కటంటే ఒక్క సీసీ కెమెరా కూడా లేదు. గతంలో దాతల సహకారంతో పట్టణం మొత్తం సీసీ కెమెరాలు అమర్చినా, నిర్వహణ లేక అవి కాస్త మూలన పడ్డాయి. ఆ తరువాత వాటి గురించి పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. దీంతో పట్టణంలో నేరాలు నియంత్రణలో కీలకమైన నిఘా నేత్రాలు పనిచేయకపోవడంతో నేరస్థులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతుంది.

గతంలో దాతల సహకారంతో..

నిత్యం వేల మంది రాకపోకలు సాగించే డివిజన్ కేంద్రమైన కందుకూరు పట్టణంలో ప్రజల భద్రత చాలా ముఖ్యం. ఈ నేపథ్యంలో పోలీస్ నిఘాతో పాటు, ఏ చిన్న సంఘటన జరిగినా పసిగట్టే విధంగా గతంలో పట్టణం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దాతల సహకారంతో పోలీస్‌శాఖకు పెద్ద ఎత్తున విరాళాలు ఇప్పించారు. అలాగే పలు కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీల నుంచి కార్పొరేట్ రెస్పాండ్ ఫండ్ నుంచి నిధులు ఇప్పించారు. వీటి సహకారంతో పట్టణంలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు బిగించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు అయిన పోస్టాఫీస్ సెంటర్, పామూరు బస్టాండ్, డిపో ఏరియా, కోటారెడ్డి సెంటర్‌లతో పాటు, పట్టణ శివారు ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. పట్టణంలో దాదాపు 50కి పైగా ఉన్నాయి. వీటిని అనుసంధానిస్తూ పట్టణ పోలీస్ స్టేషన్ ప్రత్యేక టీవీ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే పట్టణంలో ఏం జరుగుతుంది అనేది 24 గంటలు పర్యవేక్షించేలా ఏర్పాటు ఉండేది. దీని వల్ల పట్టణంలో ఏ మూలన ఏం జరిగినా వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకునే వారు. రోడ్డు ప్రమాదాల దగ్గర నుంచి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ వరకు ఎంతో కీలకంగా సీసీ కెమెరాలు అప్పట్లో ఉపయోగపడ్డాయి. దీంతో నేరాల నియంత్రణ చాలా సులభం అయ్యేది. కానీ అటువంటి నిఘా వ్యవస్థ ప్రస్తుతం కందుకూరు పట్టణంలో ఎక్కడా పనిచేయడం లేదు. ఒక్కటి అంటే ఒక్క సీసీ కెమెరా కూడా పట్టణంలో ప్రస్తుతం పనిచేయడం లేదు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అసలు ఉన్నాయా లేవా అనేది కూడా అర్థం కాని పరిస్థితి. నిర్వహణ అటువంటి గతంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఏమయ్యాయో కూడా తెలియడం లేదు.


పోస్టాఫీస్ సెంటర్‌లో పనిచేయని సీసీ కెమెరా

నిఘా కొరవడటంతో డొల్లగా మారిన కేసుల ఛేదింపు

- ఇటీవల అంకమ్మదేవాలయం దగ్గర ఉన్న టీ దుకాణం అర్ధరాత్రి దగ్ధమైంది. ఇది రాజకీయంగా పెద్ద వివాదమే అయింది. ఆ తరువాత కేసు నమోదు చేసిన పోలీసులు ఆ సంఘటనకు బాధ్యులు ఎవరనేది ఇంత వరకు తేల్చలేక పోయారు. సంఘటన జరిగిన సమయంలో ఆ వైపు ఎవరు వెళ్లారు అనే సమాచారం పోలీసులకు లభ్యం కాకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు.
- పట్టణ నడిబొడ్డున కనిగిరి రోడ్డులోని ఓ వైశ్య వర్గానికి చెందిన కుటుంబంపై అర్ధరాత్రి దుండగలు ఇంట్లోకి ప్రవేశించి వారిని నిర్బంధించి నానా బీభత్సవం సృష్టించారు. ఆ దంపతులపై హత్యాప్రయత్నం కూడా జరిగింది.
- ఇటీవల జరిగిన బంగారు షాపులో దాదాపు రూ. 60 లక్షలు విలువ చేసే ఆభరణాలు దోచుకున్న దొంగలు షాపులోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యారు. దీంతో పోలీసులు ఆ దొంగను వెంటనే గుర్తించడం వల్ల ఒక్క రోజులోనే కేసును ఛేదించారు. కానీ ప్రభుత్వం మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ.. నేరస్తులను పట్టుకోలేకపోతోంది.

జామాయిల్ కర్రకు మంచి గిరాకీ


వేములపాడు పొలాలో ఏపుగా పెరిగిన క్లోన్స్ జామాయిలు తోట


హనుమంతునిపాడులో లారీకి జామాయిల్ కర్ర ఎక్కిస్తున్న కూలీలు

హనుమంతునిపాడు: జామాయిల్ కర్రకు మంచి గిరాకీ పలుకుతోంది. మండలంలో తువ్వ భూములున్న గ్రామాల్లో జామాయిల్ సాగు విస్తారంగా ఉంది. ప్రస్తుతం ప్రతి రోజు వేములపాడు కేంద్రంగా 20 లారీలకు పైబడి జామాయిల్ కర్ర వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. తువ్వ భూములున్న ప్రాంతాలైన వేములపాడు, మహమ్మదాపురం, లింగంగుంట్ల, ఉమ్మనపల్లి, నందనవనం,వీరరాంపురం, తిమ్మారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు, హాజీపురం, దాసరిపల్లి గ్రామాల్లో జామాయిల్ 4 వేల హెక్టార్లకు పైగా సాగు చేశారు. కొంత మంది రైతులు వ్యవసాయ బోరు బావుల కింద వందల ఎకరాలో క్లోన్స్ జామాయిలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జామాయి కర్రకు మంచి గిరాకీ వచ్చింది. ప్రతి రోజు వేములపాడు నుంచి 20 లారీలు కడప, నంధ్యాల, కర్నూలు, మదనపల్లి, కందుకూరు, నెల్లూరు, ప్రాంతాలకు తరలిస్తున్నారు. మదనపల్లి ప్రాంతానికి వాసం కర్ర, టమోటా సాగు రైతులకుతరలిస్తున్నారు. వాసం కర్ర రైతు వద్ద టన్ను రూ.4000 పలుకోత,ధి. బార్లు లావు కర్ర రైతు వద్ద టన్ను రూ.4500 నుంచి రూ.5000 పలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కూలీలకు టన్ను కర్ర కోసి లారీకి లోడ్ చేసినందుకు రూ.500 చెల్లిస్తున్నారు. వాసం జామాయిల్ కర్రకు టామాటా సాగు సీజన్‌లో మంచి ధర ఉంటుందని రైతులు చెప్తున్నారు.

ముస్లింల ఐక్యతే ప్రధాన లక్ష్యం

కందుకూరు: ముస్లిం ప్రజల మధ్య ఐక్యతను తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ముస్లిం ఐక్యవేదిక పనిచేస్తుందని ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్‌జాన్ అన్నారు. ముస్లిం ఐక్య వేదిక నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం మసీద్–ఎ–ఆస్మాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులను మెరుగుపర్చడం కోసం, ముస్లింలందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. కావున ప్రతి ముస్లిం ముస్లిం ఐక్యవేదికలో చేరి సంస్థ బలోపేతానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కందుకూరు నియోజకవర్గానికి యువకుడు, సామాజిక స్పృహ ఉన్న మహబూబ్‌బాషాను అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సహకరించి ముస్లిం ఐక్య వేదిక బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కందుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల హక్కులను కాపాడడం కోసం ముస్లిం ఐక్యవేదిక పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ముస్లింలకు ఏ సమస్య ఉన్నా ఐక్యవేదిక తరఫున పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు ఐక్యవేదికక నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దతలు, పట్టణంలోని అన్ని మసీదుల నుంచి మోజాన్లతో పాటు యాసీన్, నజీర్ మౌళి, హ్యాపీభాష, ఫజిల్ రహీంబాయి, ఏజాస్, ముస్తఫా, ఫిరోజ్, సలీమ్, హబీబుల్లా, అసదుల్లా, హబీల్, జహంగీర్ మలాంగ్, మస్తాన్, నజీర్‌భాయ్, ఉస్మాన్, ఫయాజ్, బేగ్, నయీముల్లా, రహంతుల్లా, జహీర్, జిలాని, బాబు, ఐఎఫ్‌సి, ఎండీఓ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన


విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెంలో రూ. 4.50 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంత్రులు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, దామచర్ల సత్య, పాల్గొన్నారు.

ఉత్తమ డెలిగేట్ అవార్డు అందజేత


ఆర్టీసీ ఎండీ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న సుబ్బారావు

కందుకూరు: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగి నల్లూరి సుబ్బారావు ఉత్తమ డెలిగేట్‌గా ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమల రావు చేతుల మీదుగా ప్రశంస పత్రం, బహుమతి అందుకున్నారు. ఈ మేరకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆర్టీసీ సీసీఎస్ 69వ వార్షిక మహాసభలో ఉత్తమ డెలిగేట్‌గా ఎంపిక చేసి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల పొదుపు, పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేసినందుకు ఉత్తమ డెలిగేట్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఈయూ నాయకులు రాజు, మహేష్, శివ, కొండలు, రహంతుల్లా, స్వామి తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో సుబ్బారావుకు అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కనిగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, అటవీశాఖ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణం కోసం జీవన శైలీ (లైఫ్) అంశాలపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడకూడదని, వ్యర్థాలను తగ్గించడం జీవన శైలికి ఎంతో మంచిదని వెల్లడించారు. తొలుత పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎస్ నరసింహారావు, ఎం సునీల్ కుమార్, ఎం రమేష్, మున్సిపల్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, అధికారులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞలో చైర్మన్ గఫార్, అధికారులు

నేడు 'ఇది మంచి ప్రభుత్వం'

కందుకూరు రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కందుకూరు మండలంలోని మోపాడు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో జరిగే ప్రజావేదికలో సమస్యలను అర్జీలు రూపంలో తెలియజేయాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపాలి

లింగసముద్రం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 1న జరిగే మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థులు హాజరయ్యి తమ ప్రతిభను నిరూపించుకోవాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు జి.మహేంద్ర, ప్రదీప్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముందుగా ఈ నెల 25న పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చెకుముఖి టాలెంట్‌టెస్ట్ నిర్వహిసస్తామని, పాఠశాల స్థాయిలో ప్రతి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపికచేసి మండల స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌లో వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రవేశ రుసుం రూ.10 ఉంటుందని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లో ఓల్టేజీతో కరెంట్ కష్టాలు..!

- అధిక లోడుతో ఎస్సీ కాలనీలకు నాణ్యమైన విద్యుత్ అందక ఇబ్బందులు
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

పొన్నలూరు: స్థానిక అంబేడ్కర్ నగర్, బాప్టిస్ట్ నగర్, సిద్ధార్థ నగర్‌లోని గృహాలతో పాటు గ్రామంలోని మరికొన్ని గృహాలకు నాణ్యమైన విద్యుత్ అందక నిత్యం లోఓల్టేజ్ కష్టాలు వెంటాడుతున్నాయి. కాలనీలకు సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలతో పాటు వివిధ కారణాలతో కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో లోఓల్టేజీతో అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఈ మూడు కాలనీలో సుమారుగా 700 కుటుంబాల వారు నివాసముంటున్నారు. అయితే ఈ కాలనీలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సప్లయ్ ఇస్తున్నారు. దీంతో అధిక లోడు ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉండటంతో నిత్యం లో ఓల్టేజ్ సమస్య తలెత్తుతుంది. మూడు కాలనీలతో పాటు గ్రామంలోని కొన్ని గృహాలకు నిత్యం విద్యుత్ సరఫరా ఉన్నా రాత్రిళ్లు గృహాల్లోని బల్బులు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాలు పనిచేయడం లేదు. వాస్తవంగా కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అధిక లోడుతో లోఓల్టేజీకు గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన గోశాలలో గోపూజ నిర్వహించారు. ఉదయాన్నే శ్రీనారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అభిషేకోత్సవం నిర్వహించి అర్చకులు మహానైవేద్యంతో భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, నాగరాజు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మిన్న

కొండపి (సింగరాయకొండ): ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని యూనిట్ ఇన్‌చార్జి మందాకిని అన్నారు. మండలంలోని నేతివారిపాలెంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంటలకు కషాయాలు ఏ దశలో వాడాలో రైతులకు వివరించారు. రసాయనిక పురుగుమందుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. అగ్ని అస్త్రం కషాయాన్ని తయారుచేసి దాని ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో నేతివారిపాలెం ఐసీఆర్‌పీలు దివి జోత్స్న, మస్తాన్, రైతులు పాల్గొన్నారు.


అగ్ని అస్త్రం తయారీని రైతులకు వివరిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి మందాకిని

అంగన్‌వాడీలు పౌష్టికాహార నిధి కేంద్రాలు


చింతలపాలెంలో పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి


గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, కార్యకర్తలు

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార నిధి కేంద్రాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని చింతలపాలెంలో ఆదివారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కేంద్రం పరిధిలోని కిశోర బాలికలు పౌష్టికాహార ఆవశ్యతపై వివరించి వారికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. కేంద్రానికి వచ్చే పిల్లల బరువులను విధిగా నమోదుచేయాలని సూచించారు. గర్భిణులకు సీమంతం చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కందుకూరు రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం ప్రజాతంత్ర వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. కందుకూరు యూటీఎఫ్ భవనంలో ఆదివారం సీతారాం సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ వామపక్ష మేధావి, విఖ్యాత విద్యావేత్త కామ్రేడ్ ఏచూరి సీతారాం తాగ్యం మరువలేనిదన్నారు. లౌకికవాది, పోరాటయోధుడు ఏచూరి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యల పట్ల అవగాహన, కమ్యూనిస్టు పార్టీలో అంకితభావంతో కింది స్థాయి నుంచి జాతీయ కార్యదర్శిగా ఎదగడం, వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేయడంలో ఆయన కీలక పాత్ర వహించారన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై గొంతుకు వినిపించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ప్రజా సంఘాల జిల్లా నాయకులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి తాపత్రయపడ్డారని తెలిపారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


ఏచూరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విఠపు

శాంతి భద్రతల రక్షణే కర్తవ్యం

కందుకూరు: నియోజకవర్గంలో శాంతి, భద్రతలను పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్యులతో పోలీస్‌శాఖ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లడారు. ఆర్యవైశ్యులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటానన్నారు. పట్టణంలో ఏ చిన్న సంఘటన జరిగినా గుర్తించే విధంగా అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని, ఆర్యవైశ్యులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు, పట్టణంలో నివశించే ప్రతి ఒక్కరూ తమ విలువైన వస్తువులను భద్రపర్చుకోవడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సీసీ కెమెరాలు ఉండడం వల్లనే గాయత్రి జ్యూయలర్స్‌లో దొంగతనం చేసిన దొంగ దొరికాడని, కావున ప్రతి షాపులో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వీపీజీ జ్యూయలర్స్ యజమాని వేముల సుకుమార్‌గుప్తా సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 50వేల విరాళం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, కొత్తూరి సుధాకర్‌రావు, కోటా కిషోర్, చక్కా వెంకట కేశవరావు, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రెసిడెంట్ కోటా నరసింహం, ది బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి సుబ్బారాయుడు, కార్యదర్శి తుమ్మపూడి సురేష్, మురారిశెట్టి వెంకట సుబ్బారావు, బొగ్గవరపు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ చీదెండ్ల పిచ్చయ్య, పట్టణ ఎస్సై సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు